క్లుప్తంగా

హార్సిలీహిల్స్‌పై సందర్శకుల సందడి

బి.కొత్తకోట : దసరా సెలవుల చివర్లో బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిహిల్స్ సందర్శకుల తాకిడితో సందడిగా మారింది. రోడ్లపైన, దర్శనా స్థలాల వద్ద, ఎటుచూసిన సందర్శకులే..ప్రకృతి అందాలు తిలకించే ప్రాంతాలు, పార్కులు, చెట్లకింద, అతిథిగృహాలు, గాలిబండ, రోడ్లపై ఎక్కడ చూసిన సందర్శకులతో కొండ కిక్కిరిసి పోయింది. జనవరి ఒకటి తర్వాత ఈ ఏడాదిలో అత్యధిక సందర్శకుల రాక ఈ మూడురోజుల్లోనే. ఆదివారం నుంచి మంగళవారం వరకు విపరీతమైన రద్దీ పెరిగింది. సందర్శకులతో వ్యూపాయింట్లు, గాలిబండ, అటవీప్రాంగణం, పార్కులు నిండిపోయాయి.

రేపు మండల్ మీట్

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మహమూద్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఏర్పాటు

కేవీపల్లె : ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర కమిటీని నూతనంగా ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈగ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ కంభిరెడ్డిగారిపల్లె ఎస్టీ కాలనీలో గిరిజన యానాదుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 30 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయిన తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా పులి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులుగా జానం గంగిరెడ్డి, సలహాదారులుగా తుపాకుల హరిప్రాద్, కృష్ణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మహిళా అధ్యక్షురాలుగా పద్మ, ప్రధాన కార్యనిర్వాహక అధ్యక్షురాలుగా సావిత్రమ్మలను ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు వివరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



హరీష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

గుర్రంకొండ : మండలంలోని మర్రిపాడు పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆపార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి సమక్షంలో పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 50 మంది టీడీపీ నాయకులు పార్టీలో చేరారు. టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ కుమారుడు మల్లికార్జున, మాజీ గ్రామకమిటీ అధ్యక్షులు నాగరాజు, వడ్డీ జాఫర్‌లతో పాటు మరో 47మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథ్, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

19 మంది జూదరుల అరెస్ట్

– రూ.60,560 స్వాధీనం

గుర్రంకొండ : మండలంలో 19 మంది జూదరలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.60,560 స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ గేరెడ్డిగారిపల్లె సమీప అటవీ ప్రాంతలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 52,160 స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ ప్యారంపల్లె సమీప పొలాల్లో జూద శిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది జూదరులను, వారి నుంచి రూ. 8400 స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేశాలు దానం

మదనపల్లె సిటీ : కేన్సర్ బాధితుల మోములో చిరునవ్వులు చిందించాలన్న ఆశయంతో హెల్పింగ్‌మైండ్స్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన రిఫియాలంజుమ్, గాయిత్రి కేశాలు దానం చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్దనున్న హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో విద్యార్థులు తమ తల్లి దండులతో వచ్చి కేశాలను అందజేశారు. సంస్థ నిర్వాహకులు అబూబకర్‌సిద్దిక్ మాట్లాడుతూ కేన్సర్ బాధితులకు దాతలు ఇచ్చిన కేశాలతో విగ్గులు తయారు చేసి వారికి అందజేయడం జరుగుతుందన్నారు.

సింహ గర్జనను విజయవంతం చేయాలి

తంబళ్లపల్లె : ఈ నెల 29న గుంటూరులో చేపట్టిన దూదేకుల ముస్లిం సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు జిందాదుల్లా కోరారు. మంగళవారం తంబళ్లపల్లెలో సంఘం నాయకులతో చర్చా సమావేశం జరిగింది. సింహగర్జనపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడ్డారని, తమ హక్కులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు ఇమాముల్లా, మండల నాయకులు కరీమ్ , దస్తగిరి, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

- అమ్మవారి ఆలయాల్లో పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో హోమాలు, పూజలు
- రూ.80 లక్షలతో ధనలక్ష్మి అలంకారంలో వాసవీమాత



మదనపల్లె సిటీ: కన్యాకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు

మదనపల్లె సిటీ : దసరా ఉత్సవాలు ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకోవటానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.స్థానిక బెంగళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ చండీ హోమం నిర్వహించారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొగటవీర క్షత్రియ మహిళా సంఘం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ,గాజులు, పసుపు దారాలు అందజేశారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ అధ్యక్షులు ఉప్పు రామచంద్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లలితాత్రిపురసుందరిదేవి అమ్మవారిని మహాలక్ష్మి అలంకారంలో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఉదయం ఉత్సవ విగ్రహాలు పూజలు చేశారు. సాయంత్రం స్వామి మహా విష్ణువు అలంకారంలో ఆలయం చుట్టూ ఊరేగించారు. అర్చకులు విజయదశమి పురస్కరించుకుని జమ్మి చెట్టుకు పూజలు చేశారు.

ధనలక్ష్మి అలంకారంలో వాసవీ మాత:
దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారిని శ్రీ ధనలక్ష్మి అలంకారంలో అలంకరించారు. సుమారు రూ.80 లక్షల డబ్బులతో అలంకారం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి అలంకారం చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లతో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. ఓం శాంతి ప్రజాపిత బ్రహ్మకుమారిల ద్వారా చైతన్య దుర్గాదేవి అలంకారం భక్తులను ఆకట్టుంది. కోటవీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయ అర్చకులు సాయిచక్రవర్తి అమ్మవారికి సారెను సమర్పించారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే:
స్థానిక వాసవీభవన్‌వీధిలో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్ ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్లు రాజేష్, సుగుణ, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

వాహనాలకు పూజలు:
విజయదశమి సందర్భంగా వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. లారీలు,బస్సులు, జీపులు, ద్విచక్రవాహనాలకు శుభ్రం చేసి పూలు అలంకరించి గంగమ్మ వద్ద పూజలు నిర్వహించారు.

వైభవంగా విజయదశమి వేడుకలు
వాల్మీకిపురం : మండల వ్యాప్తంగా విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో అమ్మవార్లను విశేష అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక షిరిడిసాయి నగర్‌లోని శ్రీ షిరిడిసాయి బాబా ఆలయంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయిబాబాను పట్టణంలోని పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు.

రాజరాజేశ్వరీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి
గుర్రంకొండ : గుర్రంకొండలో దసరా ఉత్సవాల సంబరాలు ముగిశాయి. మంగళవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి, గ్రామదేవతలు పోలేరమ్మ, గంగమ్మ, శ్రీకన్యకా పరమేశ్వరీమాత శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసంర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
కలికిరి : మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. విజయదశమి పర్వదినం సందర్భంగా కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. పట్టణంలోని పార్వతీ సమేత సోమేశ్వరాలయంలో అమ్మవారి దేవినవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. పల్లవోలు కస్పాలో వెలసిన చౌడేశ్వరి దేవికి విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తంబళ్లపల్లెలో..
తంబళ్లపల్లె : మండలంలో శరవన్నవరాత్రుల వేడుకలు ఘనంగా ముగిశాయి. మల్లయ్యకొండపై వెలసిన గౌరీదేవి ఆలయంలో పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. బురుజు గ్రామం చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భక్తులతో ఆలయాలు కిటకిట
ములకలచెరువు : మండలంలోని ఆలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోంపల్లి కోట చౌడేశ్వరి దేవి ఆలయం, తంబళ్లపల్లి క్రాస్ లో ఉన్న చౌడేశ్వరి దేవి ఆలయం, బురకాయలకోట శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయానికి ప్రతీక విజయదశమి
కురబలకోట : విజయానికి ప్రతీక విజయదశమి అని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం ఘనంగా దసరా వేడుకలు నిర్వహించారు. వివిధ వాహనాలకు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల భవిష్యత్తుకు పునాది విద్యార్థులేనన్నారు. మనిషిని గొప్పగా మార్చేది జీవన విధానమే కాదు వ్యక్తిత్వం, నడవడిక. సత్ప్రవర్తన మాత్రమేనన్నారు.

మొలకవారిపల్లెలో..
మండలంలోని మొలకవారిపల్లెలో ఆదివారం రాత్రి విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆ గ్రామ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని ఊరేగించారు.

దుర్గాదేవిగా శ్రీచౌడేశ్వరిదేవి
కలకడ : దశరా మహోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని కలకడ, గుడిబండ, కోన, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె పంచాయతీలలో వెలసిన చౌడేశ్వరిదేవిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయాల వద్ద తొగటవీరక్షత్రియులు అమ్మవారిని మేల్కొలుపు ఖడ్గపద్యాలు పలికి ఏటాబోనం సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు
నిమ్మనపల్లె : మండల పరిధిలో ప్రజలు దసరా వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నిమ్మనపల్లె పెద్దమాదిగపల్లె మాతమ్మతల్లి ఆలయం, బాలినాయునిపల్లె చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతమ్మతల్లి మహిషాశురమర్థినిగా భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమి సందర్భంగా ఆలయ వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి ఊరేగింపు
కేవీపల్లె : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చీనేపల్లెలో శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారినం చాందినిబండిలో అలంకరించి మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామంలో ఊరేగించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



మదనపల్లె : ధనలక్ష్మి అలంకారంలో వాసవీ మాత



మదనపల్లె : ఆకట్టుకున్న చైతన్య దుర్గాదేవి అలంకారం



వాల్మీకిపురంలో బాబా నగరోత్సవం



గుర్రంకొండ : గంగమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు



మొలకలచెరువు : కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు



కురబలకోట : అమ్మవారి ఊరేగింపు



గుర్రంకొండ : రాజరాజేశ్వరీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి



తంబళ్లపల్లె : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కలకడ : దుర్గాదేవిగా దర్శనమిస్తున్న చౌడేశ్వరిదేవి



నిమ్మనపల్లె: మహిశాశురమర్ధినిగా మాతమ్మతల్లి



కేవీపల్లె : విశేషాలంకరణలో చౌడేశ్వరిదేవి



వాల్మీకిపురం: విశేష అలంకరణలో షిరిడిసాయిబాబా



కలికిరి: రాజరాజేశ్వరి దేవి అలంకారంలో ఎల్లమ్మ

నెరవేరిన లారీ అసోసియేషన్ చిరకాల స్వప్నం

- మంత్రి పెద్దిరెడ్డి చొరవతో కార్యాలయం, పార్కింగ్‌కు స్థలం కేటాయింపు
- ప్రభుత్వ మార్కెట్ ధరకు విలువైన స్థలం అప్పగింత
- శాశ్వత భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా



లారీ అసోసియేషన్ భవన నిర్మాణ పనుల భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : మదనపల్లె లారీ అసోసియేషన్ చిరకాల స్వప్నం సాకారమైంది. ఎన్నో ఏళ్లగా లారీ అసోసియేషన్‌కు శాశ్వత కార్యాలయం, లారీల పార్కింగ్‌కు స్థలం కావాలన్న డిమాండ్ నెరవేరింది. రాష్ట్ర విద్యుత్, అటవీ,పర్యావరణశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో, ఎమ్మెల్యే నవాజ్‌బాషా కృషితో మదనపల్లె-చిత్తూరు ప్రధాన జాతీయరహదారిపై వలసపల్లె మండలంలో విలువైన ప్రభుత్వస్థలం మార్కెట్‌ధరకు లారీ అసోసియేషన్ సొంతమైంది. సోమవారం సాయంత్రం విజయదశమి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా లారీ అసోసియేషన్ భవన నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో విజయవాడ తర్వాత మదనపల్లెలో లారీ డిపార్ట్‌మెంట్‌ను నమ్ముకుని సుమారు 25,000 మందికి పైగా జీవనం సాగిస్తున్నారన్నారు. లారీ అసోసియేషన్ సభ్యులు చాలాకాలంగా తమకు శాశ్వతంగా స్థలం కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వాలకు విన్నవించడం జరుగుతూనే ఉందన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేగా తనను కలిసిన లారీ అసోసియేషన్ సభ్యులు అధ్యక్షుడిగా తనను ఎన్నుకుని, తమ చిరకాల కోరికను విన్నవించారన్నారు. ట్రాన్స్‌పోర్ట్ రంగం సమస్యలపై అవగాహన ఉండటంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ప్రత్యేకంగా వివరించినట్లు చెప్పారు. వారు సానుకూలంగా స్పందించి ప్రత్యేక జీఓ ద్వారా మార్కెట్‌ధరకు 1.83 ఎకరాల స్థలాన్ని అసోసియేషన్‌కు కేటాయించేలా చర్యలు తీసుకున్నారన్నారు. లారీ అసోసియేషన్ సభ్యులు ఐకమత్యంగా ఉంటూ, అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, రహంతుల్లా, మదనపల్లె లారీ అసోసియేషన్ సెక్రటరీ మాబుపీరా, వైస్‌ప్రెసిడెంట్ సుధాకరనాయుడు, ఎస్.వి.ఆర్.నూరి, షౌకత్, మౌలాలిబాబు, ఎస్.జే.ఎస్.నవాజ్, జే.కే.వెంకటేష్, ఖలీమ్, అంజాద్, ఎల్.వి.ఆర్.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

31న వాల్మీకిపురంలో జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వాల్మీకిపురం : స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీ మంగళవారం ఉదయం 9గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొంటున్నాయని, 18 సంవత్సరాలు పైబడి, 28 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావచ్చన్నారు. అభ్యర్థులు ముందుగా వలంటీర్ల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, నల్లారి తిమ్మారెడ్డి, జెడ్పీటీసీ నిర్మల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, కలికిరి ఎంపీపీ నూర్జహాన్, నాయకులు శివానంద రెడ్డి, జమీర్‌అలీఖాన్, శ్రీధర్‌రాయల్, కేశవ రెడ్డి, నీళ్ల భాస్కర్, నరసింహులు, వెంకట్రమణ, కిరణ్ కుమార్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా ఏకాసన పారాయణం

పెద్దతిప్పసముద్రం : టీటీడీ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే మంగళవారం స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో 16 పర్యాయములు హనుమాన్ చాలీసా ఏకాసన పారాయణ కార్యక్రమం నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య,ఆకుల మల్లికార్జునల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల బృందం హనుమాన్ చాలీసా పారాయణానికి ప్రజలు భక్తి పారవశ్యంతో పులకించారు.

టపాసుల విక్రయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

వాల్మీకిపురం : టపాసుల విక్రయాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాల్మీకిపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో టపాసుల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ దీపావళి పర్వదినాన టపాసుల అమ్మే సమయంలో, వాటిని భద్రపరిచే విషయంలో వ్యాపారస్తులు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై వివరించారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ పరికరాలు తమ వద్ద ఉంచుకోవాలని, లేనిపక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి
కలికిరి : దీపావళి పర్వదినం సందర్భంగా టపాసుల విక్రయదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటించాలని వాల్మీకిపురం సీఐ సురేష్ అన్నారు. సోమవారం కలికిరి పోలీస్ స్టేషన్‌లో దుఖాణ దారులతో సమావేశమయ్యారు. నివాసాలకు దూరంగా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని, టపాకాయలు భద్రపరచునప్పుడు, అమ్మేటప్పుడు ఏలాంటి ప్రమాదాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మానవత్వంతో బాధితులకు ఎంపీ ఆర్థిక సాయం

వాల్మీకిపురం : మండలంలోని అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు, చదువుకుంటున్న యువతకు, గుడి, మసీదు, చర్చిలకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సొంత నిధులతో రూ.10లక్షలను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే చేతులమీదుగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సొంత నిధులతో పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పేదలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరిద్దాం

పెద్దతిప్పసముద్రం : వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేద్దామని ప్రజా ప్రతినిధులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, గణపతిరెడ్డి, అనిత, కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఐప్యాక్ టీం సభ్యులు హేమంత్, ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. వచ్చే నెల 1 నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఆయా పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులు ప్రజలకు క్షుణంగా వివరించేలా దిశా నిర్దేశం చేశారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేందుకు మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి ఎందుకు కావాలి అనే అంశంపై చర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఇప్పటికే అన్ని విధాలా ఎంతో అభివృద్ధి చేసుకోగలిగామన్నారు. ఇందుకు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మెజార్టీ ఇవ్వడంతోనే సీఎం దృష్టికి వెళ్లడం, అధిక నిధులు మంజూరు చేశారన్నారు. పార్టీ నియోజకవర్గ ప్రత్యేక ఆహ్వానితులు ఇరగం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చి, సామాజిక అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేశారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు చినరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, మండల కన్వీనర్ చౌడేశ్వర్, సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి, ఆర్‌బీకె చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు మరణం ఉండదు
కురబలకోట : ప్రజలకు మంచి చేసిన మహనీయులకు మరణం ఉండదు. అందుకు నిదర్శనమే వైఎస్సార్ అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కొనియాడారు. మండలంలోని కడప క్రాస్ సమీపంలో కొత్తగా నిర్మించిన జగనన్న కాలనీలో హైవే పక్కన వైఎస్సార్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ లాంటి మహా నేత శరీరానికి మరణం ఉండవచ్చు కాని వారు చేసిన మంచి పనులు ఎప్పటికీ చరిత్రలో నిలచి ఉంటాయన్నారు. దేశంలోనే తొలి సారిగా ఉమ్మడి రాష్ట్ర సీఎంగా రైతులకు ఉచిత కరెంటు ఇచ్చి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలచిపోయారన్నారు. ఇంతటి ప్రజాభిమానం కలిగిన నాయకుడు దేశంలో ఎవ్వరూ లేరని చెప్పవచ్చన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడచుకోవాల్సిన అవసరం ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్ర సీఎంగా వైఎస్ జగన్ వివిధ సంక్షేమ పథకాల ద్వారా తండ్రికి మించిన తనయుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్వీ రమణారెడ్డి, క్రాస్ నారాయణరెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి, తులసీరాం రెడ్డి, వై. మోహన్‌రెడ్డి, మధు, రమేష్ రెడ్డి, ముస్తాక్,లోకేష్, చెన్నామర్రి వెంకట్రమణారెడ్డి, వై.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



ఫుట్‌బాల్ క్రీడకారులతో నిర్వాహకులు

మదనపల్లె సిటీ : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వి.నారదరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో దసరా ఫుట్‌బాల్ క్యాంపు ముగింపు కార్యాక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా వచ్చే నెలలో ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారన్నారు. దసరా సెలవుల్లో ఉచిత క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలోఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, మురళీధర్, సభ్యులు హరి, మహేంద్ర, షూటింగ్‌బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సాయిశేఖర్‌రెడ్డి, నరేష్‌బాబు, దినకర్,సైసావల్లి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు ప్రజాప్రతినిధులు, జేఎస్‌వీ కన్వీనర్లతో సమీక్ష

పెద్దమండ్యం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ అధ్యక్షతన మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ మొఘల్ చాంద్‌బాషా తెలిపారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి వివరిస్తారని చెప్పారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.